# కాలుష్యం కోరల్లో!...



బంగారు నూలు పోగుల కిరణాలు ఆకాశంనుండి జారి పుడమితల్లిని పులకరింప చేస్తున్నవేళ!

వరండాలో వాలుకుర్చీలో కూర్చున్నాడు చంద్రయ్య. వార్తాపత్రికలో తల దూర్చాడు. ఒక్కపూట కాఫీ లేకపోతే ఓర్చుకోగలడు కానీ-చంద్రయ్య ప్రతినిత్యం వార్తా పత్రికను చదివే అలవాటును మాత్రం మార్చుకోలేకపోయాడు.

వార్తను వార్తగా చదివి వదిలిపెట్టడం లేదా ఒక నిట్టూర్పుతో సరిపెట్టడం సహజం. అది సాధారణ మనస్తత్వం. కానీ చంద్రయ్య అలాకాదు. చదివిన ప్రతివార్తకు స్పందిస్తాడు.

ఆరోజు పత్రికలో అవార్త చదివి చలించిపోయాడు చంద్రయ్య. పత్రిక మీది చూపును శూన్యంలోకి మళ్ళించి ఆలోచిస్తున్నాడు.

మట్టిలో ఎరువు కలిస్తే ఆమట్టి సారవంతమవుతుంది. సారవంతమైన మట్టిలో చక్కని పంటలు పండుతాయి. బంగారంలో కాస్త రాగి కలిస్తే అందమైన ఆభరణాలు తయారీకి యోగ్యమవుతుంది. కానీ.... కానీ...!

జరుగుతున్నది అది కాదు కదా?

తాగుతున్న నీటిలో కాలుష్యం. పీలుస్తున్న గాలిలో కాలుష్యం. అనుభవిస్తున్న వెలుతురులో కాలుష్యం. కొంటున్న నిత్యావసరవస్తువుల్లో కల్తీపేర కాలుష్యం. వింటున్న మాటల్లో కాలుష్యం. చూస్తున్న మనసుల్లో కాలుష్యం. చేస్తున్న పనుల్లో కాలుష్యం. రాస్తున్న సాహిత్యంలో కాలుష్యం. రాజకీయాల్లో అసలుసిసలైన కాలుష్యం!

ఇవి గొప్ప గొప్ప విశ్వవిద్యాలయాలు పనిగట్టుగొని పరిశీలించి పరిశోధనల్లో నిగ్గు తేల్చిన కొత్త విషయాలేమీ కాదు. కాలుష్య కరాళనృత్యానికి ఎవరిమట్టుకు వాళ్ళు తమవంతు కర్తవ్యంగా తాళం వేస్తున్నదే కదా?

కానీ శ్రమజీవులు పొద్దస్తమానం చెమట కార్చికార్చి సళ్ళొదిలిన నరాలకు సత్తువన్న భ్రమలో తాగిన సారాలోకూడా కల్తీ!

"కల్తీసారాయి తాగి ఆరుమంది దుర్మరణం."

'నాగరికతతో స్వార్థం. స్వార్థంతో విచక్షణ కోల్పోతున్న ఈ ఆధునిక సమాజంలో కాలుష్యనివారణకు మార్గమే లేదా?' అని ఆలోచిస్తున్న చంద్రయ్య చూపులు శూన్యంలో నుండి మళ్ళీ వీధివాకిలికి తగులుకొని అటుయిటు కదలలేక పోయాయి.

ఎలా కదలతాయి?

రాత్రి ఏవ్యక్తిని గురించి ఆలోచించ కూడదనుకొంటూనే ఆలోచిస్తూ నిద్ర చెడగొట్టుకొన్నాడో ఆ వ్యక్తే కంటెదుట!- ఇంకొక వ్యక్తి తోడుగా!

ఇద్దరూ పసుపు బట్టల్తో చూడముచ్చట గొల్పుతూ!

ఊహించని సంఘటన ఉన్నట్లుండి ఊపిరి పోసుకొంటే చంద్రయ్య ఎగిరిపడ్డట్టు పైకి లేచాడు. గబగబ వాళ్ళముందుకు నడిచాడు.

చంద్రయ్య రావడంతో పసుపు బట్టలకు చేతులు వచ్చాయి. ఆ చేతుల్తో అక్షింతలు అందించారు. జోడించి నమస్కరించారు. నమస్కరిస్తూ పాదాల మీదికి వంగారు.

కాలుష్యమే తలవంచి తనపాదాల మీదికి వంగినంత తృప్తితో చంద్రయ్య అక్షింతలు వేస్తూ ఆశీర్వదించాడు!

అక్షింతలు పడడంతో పసుపు బట్టలకు ప్రాణం వచ్చింది. ఎంచినట్లు ఏడడుగులు కలిసి వెనక్కు నడిచి అక్కడ ముందుకు తిరిగి నడుస్తున్నారు_ఒకరి పక్కన ఒక్కరుగా. చూడముచ్చట గొలుపుతున్న ఆ జంటను రెప్పార్పకుండా చూస్తూ చూస్తూ ఉండగానే ఆ జంట కనుమరుగయింది. ఊహించని మధురానుభూతితో మనసు తడిసి ముద్దయింది. ఆమనసు గతంలోకి వెళ్ళే ప్రయత్నంలో ఆ స్థలం ఉన్నట్లుండి పరిసరాలను మార్చుకొని ప్రత్యక్షమయింది మంత్రజలంతో మార్పుచెందినట్లుగా!...

నీలాల నింగిని ఎవ్వరో పనిగట్టుకొని తవ్వి తలకెత్తుకొని అక్కడక్కడ కుప్పలుకుప్పలుగా పోసినట్లు నీలాలు పారుతున్న కొండలు... ఆ కొండలమధ్య పాకలేక పాకుతున్న కొండశిలువలా నల్లని తారు రోడ్డు...కొండ అడుగుభాగాన్నుండి ఏటవాలుగా సాగి రోడ్డు వద్ద ఆగిన బయలు... ఆ బయల్లో అక్కడక్కడ పొడిచెట్లు...చిన్న చిన్న పొదలు...లేత ఆకుల సందుల్లోనుండి దూరి పుడమి తల్లిని పలకరిస్తున్న సూర్యకిరణాలు.. ఆ చెట్లను పరామర్శిస్తున్నట్లు కైవారాలు చేస్తూ పిచ్చుకలు...ఆ చిట్టి పొట్టి పొదల్లో నక్కి ఉడతలు...మిడతలు...పూరేళ్ళు...కౌజు పిట్టలు!

అక్కడ నిలబడుకొన్న అనుభూతిలో చంద్రయ్య!

అప్పుడు అతని దృష్టి తాను చేపట్టిన పనివైపు మళ్ళింది.

గుంతలు తీసేవాళ్ళు తీస్తున్నారు. మొక్కలు నాటేవాళ్ళు నాటుతున్నారు. నీళ్ళు మోసేవాళ్ళు మోస్తున్నారు. నాటిన మొక్కలకు నీళ్ళు పట్టేవాళ్ళు పడుతున్నారు. దాదాపు యాభై అరవైమంది కూలీలు ఊపిరిసలపనట్లుగా పనిచేస్తున్నారు. మొక్కలు నాటే కార్యక్రమం చకచకా సాగిపోతూ ఉంది.

ఈ కార్యక్రమాన్ని కాగితాలవరకే పరిమితం చేయాలని పట్టుబట్టాడు డి.ఎఫ్.ఓ. దొర. 'ఇది అన్యాయం. ఇటువంటి అన్యాయానికి పాల్పడలేను' అంటే ఏమన్నాడు?

"చంద్రయ్యా! నీకు అనుభవముంది కానీ అనుభవానికి తగిన ఆలోచన లేదోయ్. ఆలోచన స్థానంలో ఆవేశం మాత్రం ఉంది. ఏం ప్రయోజనం? చెప్తే అర్థంచేసుకోలేవు. పోనీ! నీ అంతట నువ్వయినా తెలుసుకుంటావంటే అదీ లేదు. నీకు తెలియనిదికాదు. ఎమ్మెల్యేగారొస్తారు మందీమార్బలంతో. మర్యాదకోసం పైకి లేచిన మనం కూర్చోకముందే 'డి.యఫ్.ఓ గారూ! కొంకనక్కలపెంటలో అంకాళమ్మ గుడిలో అన్నదానం చేస్తారు. మీ చందా మొత్తమిది!' అని మన అభిప్రాయంతో నిమిత్తం లేకుండానే ప్రకటిస్తారు. ఆ ప్రకటనకు వందిమాగధులు వంత పాడతారు. ఆయనటుపోతూనే యం.పి.గారిటొస్తారు. 'బ్రాహ్మణపట్టులో గుడి కట్టు కొంటున్నారు. కలప సరఫరా చేస్తారా? ఖరీదు చేసుకోమని పైసలిస్తారా?' అంటూ పీకలమీద కూర్చుంటాడు. అప్పుడు ఏం చెయ్యాలంటావ్? నీ జీతం నా జీతంలో నుండి ఇస్తామంటే అది ఏ మూలకు? కాకులగొట్టి గద్దల కెయ్యాల్సిందే. తప్పదు!" అంటూ విరగబడి నవ్వుతాడా?

ఒక జిల్లా అటవీశాఖాధికారి. బాధ్యతనోట మట్టిగొట్టి మాట్లాడాల్సిన మాటేనా ఇది? చెట్టును కొట్టేవాడేకానీ పెట్టేవాడు లేని ఈరోజుల్లో చెట్లు నాటమని ప్రభుత్వం మంజూరుచేసిన డబ్బును దిగమింగాలనుకోవడమా? ఛీఛీ! పెద్దపెద్ద చదువులు చదువుకొన్నవాళ్ళు....చెట్టుకు వాతావరణ కాలుష్యానికి ఉన్న అవినాభావ సంబంధం తెలిసిన వాళ్ళు...ఈ నాగరీక ప్రపంచంలో వాతావరణం ఎన్నివిధాలుగా కలుషితమై పోతున్నదో ఎరిగినవాళ్ళు- మాట్లాడాల్సిన మాటేనా ఇది? వాస్తవానికి ఒక మామూలు మనిషికంటే ఒక అటవీశాఖాధికారి ఏమాత్రం ఉన్నతుడు కాలేకపోయాడు!

పువ్వులు పూస్తున్న చంద్రయ్య ముఖంలో ఒక మ్లానరేఖ క్షణం మసకేసింది. తన్ను లొంగదీసుకోవడానికి ఆ వేళ దొరగారు పడిన పాట్లు మనసులో మెదిలేసరికి పెదవులమీద దరహాసరేఖ విరిసినట్లు విరిసి గాలితో వియ్యమందింది.

అదిలింపులకు, బెదిరింపులకు లొంగే రకంకాదని తెలిసికూడా ట్రీప్లాన్‌టేషన్ కార్యక్రమాన్ని కాగితాలకే పరిమితంచేసే ప్రయత్నంలో సంతకంపెట్టమని ఎంత సతాయించాడు? బెదిరింపుల్తో అదరకొట్టాడు?

"చంద్రయ్యా! నిన్ను పిలిపించింది నీ నుండి నీతులు వినడానికి కాదు"

"అయితే అనుమతిస్తే వెళ్ళిపోతాను"

"నా సర్వీసులో నా మాటకు ఎదురు చెప్పినవాళ్ళు లేరు. చెప్పి సర్వీసులో కొనసాగినవాళ్ళూ లేరు. కడసారిగా చెప్తున్నాను. సంతకం పెట్తావా? లేదా?"

"సంతకం పెట్టాను సార్!"

"దట్స్ గుడ్! అలారాదారికి."

"మీరు రూపొందించిన నీతిమాలిన పనిచేయడానికి కానే కాదు సార్. కావాలంటే నా వాలంటరీ రిటైర్‌మెంటుకు!"

ఆ మాటతో దొరగారి తల దిమ్మెక్కినట్లుంది. అతడు అలానే గుడ్లప్పగించి చూస్తుంటే-

"సార్! అధికారం ముందు కోపం తోక ముడుకోవచ్చు కానీ-నీతి నిజాయితీల ముందు ఏ అధికారి అయినా తలవంచాల్సిందే! ఇతరులతో నాకు పనిలేదు. నా రేంజికి మొక్కలు నాటడానికి మంజూరైన మొత్తం పైసలతోసహా నాకు వెంటనే అందకపోతే ఆతర్వాత నన్ను తప్పుపట్టకండి" అంటూ తానా రోజు బయటపడ్డాడు.

తన నిజాయితీకి బహుమతిగా సస్పెన్షన్ ఆర్డర్స్‌ను ఎదురుచూస్తున్న చంద్రయ్యకు వారం తిరగముందే తన రేంజిలో ట్రీ ప్లాంటేషన్‌కి కేటాయించిన మొత్తం మంజూరయింది. ధర్మం గెలిచిందన్న ధీమాతో డబ్బు చేతికి అందడమే తరువాయి చంద్రయ్య సరాసరి కార్యరంగంలోకి దిగాడు.

చంద్రయ్యకు కార్యం మీద కన్ను!

డి.ఎఫ్.ఓ. దొరగారికి చంద్రయ్య మీద కన్ను!!

ఈ మాత్రం గ్రహించలేని వాడేంకాదు చంద్రయ్య. అందుకే ప్రతి చిన్న పనిని స్వయంగా తానే చూసుకొంటున్నాడు.

ఆ దశలో చంద్రయ్య దృష్టి మొక్కలకు నీళ్ళు పోస్తున్న ఒక అమ్మాయిమీద పడింది.

ఆ అమ్మాయి అంతపొడవూ కాదు. అంతపొట్టీ కాదు. చెక్కిన పాలరాతి శిల్పంలా అంగ సౌష్టవం. నిమ్మపండుకు ఒక వన్నె తక్కువగా రంగు. తేనె రంగు కండ్లు. చూడముచ్చటగా ఉంది. చకచక తిరుగుతూ తన పని తాను చేసుకొంటున్న ఆ అమ్మాయిని చూస్తుంటే- 'అయ్యో

పాపం! ఏ మిద్దెల్లోనో మేడల్లోనో పుట్టి హాయిగా బతకాల్సిన అమ్మాయి ఈకూలి కొంపల్లో ఎందుకు పుట్టిందో? ఎందుకీ అగచాట్లు పడ్తూ ఉందో' అన్న జాలి కలుగుతుంది. ఆ ఆలోచన అక్కడికే ఆగదు.

'ఈ మాత్రం కన్ను ముక్కు తీరు సుద్దంగా ఉంటే పట్టణాల్లో అమ్మాయిలు ఇలా నడుం వంచి పనిచేస్తారా? ఏమో? చేతికి మట్టిగాకుండా...ఒంటికి చెమట పట్టకుండా...బతకడానికి ఎన్నో మార్గాలు! ఏదిఏమైనా పల్లెల్లో ఇంకా నీతినిజాయితి బతికే ఉంది'.

చంద్రయ్యకు ఆఅమ్మాయిమీద ఎందుకో తనకు తెలియకనే ఒకవిధమైన ఆదరణభావం ఏర్పడింది. దాంతో అప్పుడప్పుడు ఆ అమ్మాయి పనితీరును ప్రత్యేకంగా గమనిస్తున్నాడు.

అయితే ఆ అమ్మాయి పనిచేస్తున్నట్లే ఉంటుంది. ఉన్నట్లుండి ఎలా మాయమైపోతుందో పోతుంది. చంద్రయ్య ఆ అమ్మాయిని ఒక కంట గమనిస్తున్నాడు. ఆ అమ్మాయి అలా రెండు మూడు సార్లు వెళ్ళిపోయింది. అలా వెళ్ళిపోయిన రోజు కూలీకూడా అడగదు. చంద్రయ్యకు ఆశ్చర్యం కలిగింది. మధ్యాహ్నం వరకు పనిచేసినా కూలీ అడగకపోవడంతో జాలి కలిగింది. అందుకే ఒకరోజు ఉండబట్టలేక ఆఅమ్మాయితో కలిసి పనిచేస్తున్నవాళ్ళను పిలిచాడు.

"ఏఁవిటా ఆ అమ్మాయి కథ? ఒకదినం మధ్యాహ్నం వరకు పనిచేసి వెళ్ళిపోతుంది. మరొకదినం పదిగంటలకే వెళ్ళిపోతుంది. ఒకదినం పనికివచ్చినట్లే ఉంటుంది. కానీ రాదు. ఎందుకలా చేస్తుంది?" అని అడిగాడు.

వాళ్ళు బదులు సదులు చెప్పకుండా ఒకరి ముఖం ఒకరు చూసుకొంటూ ముసిముసిగా నవ్వుకొంటున్నారు.

చంద్రయ్యకు కోపం వచ్చింది.

"అడిగేది మిమ్మల్నే! ఎందుకా నవ్వు?" గద్దించాడు.

ముసిముసిగా నవ్వుతున్న ముఖాలమీద మసిపూసినట్లయింది. అప్పుడు ఒక నడితరం ఆడమనిషి కలగచేసుకొనింది.

"సాఁవీ! ఈనోటితో ఎట్ట చెప్పమంటారు? అది అడదైతే పరవాలేదు. అదొక గాడిద!"

"అంటే?"

"ఎవుడు కంటికి దొరగా కనిపిస్తేచాలు. వాడెంట పనీపాట వొదులుకోని ఎనకా ముందు సూడకుండా ఎలబారిపోతా ఉంటే అది ఆడదెట్లవితింది?"

చంద్రయ్య తల గిర్రున తిరిగింది. 'నిజమా?' అన్నట్లుగా వాళ్ళవైపు ఆశ్చర్యంగా చూస్తుంటే తలలు వంచుకొని వాళ్ళల్లో వాళ్ళే నవ్వుకొంటున్నారు.

శ్రమవిలువకే ప్రాధాన్యత ఇచ్చిందనుకొన్న ఆ అమ్మాయి ప్రవర్తనపట్ల తన ఊహలు తారుమారు అయ్యేటప్పటికి చంద్రయ్య అక్కడ నిలబడలేక పోయాడు.

చంద్రయ్య నడుస్తున్నాడు!

వెనక తనను వెక్కిరించినట్లుగా నవ్వులు వినిపిస్తూనే ఉన్నాయి.

తన తత్తరపాటు గమనించి కొంపదీసి తనకూ ఆ అమ్మాయికి అంటగట్టలేదు కదా?

చంద్రయ్య గుండె బరువెక్కింది. తల వాలిపోయింది. వాలిన తలను పైకెత్తకుండా చంద్రయ్య నడుస్తున్నాడు. తాను దారిపట్టి నడుస్తున్నా ఆలోచనలు మాత్రం ఒక దారిలో లేవు.

"వాళ్ళుకూసిన కూతలు నిజమేనా? కాకుంటే ఆ అమ్మాయి ఎందుకలా ప్రవరిస్తూ ఉంది. అలాంటి జీవితానికే అలవాటుపడ్డే ఎవ్వరైనా ఇటువంటి కష్టం చెయ్యలేరు కదా? ఆ అమ్మాయి కష్టపడే తీరు... ఆ ముఖంలో అమాయకత చూస్తుంటే 'అలాంటి రకం' అనిపించదే? అయితే వాళ్ళెందుకలా చెప్తారు? చెప్పినారంటే అందులో ఎంతో కొంత నిజం ఉండాలి. నిప్పు లేనిదే పొగరాజదు కదా? ఈపూట అది తేల్చుకోవాలి'

చంద్రయ్య స్థిరనిశ్చయంతో ముందుకు నడుస్తున్నాడు.

డి.ఎఫ్.ఓ. దొరగారి కన్ను తన మీదనే ఉంటుందని తెలుసు. ఏ క్షణంలో అయినా తనిఖీ చేయడానికి రావచ్చునని తెలుసు. పని జరుగుతున్న చోట తాను లేకపోతే తన కింద పనిచేసే ఉద్యోగుల, కూలీల పనితీరు ఎలా ఉంటుందో తనకు బాగాతెలుసు. అయినా సందేహం ప్రాణ సంకటమైతే- చంద్రయ్య నడుస్తున్నాడు!

ఆ అడవిలో అడ్డదారిని పట్టిపోతే మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుందాపల్లె. బతుకంతా అడవుల్లోనే గడిపిన అధికారి చంద్రయ్య. ఎంతెంత దూరాల్ని అడుగులతో కొలిచి కొలిచి రాటుతేలాడో? మూడు నాలుగు కిలోమీటర్లేం లెక్క?- వంచిన తల ఆ అమ్మాయి గుడిసెముందు నిలబడి పైకెత్తాడు. అదే సమయంలో ఎవరో ఒక యువకుడు ఆ గుడిసెలోనుండి పిల్లిలా జారుకొంటున్నాడు. సిగ ముడేసుకొంటూ...నలిగిన చీర సర్దుకొంటూ- ఆ అమ్మాయి గుడిసెలోనుండి బయటికి వచ్చింది. ఎదురుగా చంద్రయ్య. క్షణం నిర్విణ్ణురాలయింది!

చంద్రయ్య కనుబొమ ముడిపడింది.

మరుక్షణంలోనే ఆ అమ్మాయి తేరుకొనింది. గబగబ గుడిసెలోకి వెళ్ళింది. మంచాన్ని తెచ్చింది. గుడిసె ముందు పందిరికింద వేసింది. పాత దుప్పటిని తెచ్చి విదిలించి పరిచింది. "కూసోండయ్యా!" అనింది.

"నేను కూర్చోవడానికి రాలేదు"

కాఠిన్యంకండ్లు నిప్పులు కురిపించాయి!

ఆ అమ్మాయి అదేమీ గ్రహించే స్థితిలో లేదు.

"శానాదూరం నడిసొచ్చినారు. మంచి నీళ్ళు తాగతారాయ్యా?"

"మర్యాదల సంగతి అలా పక్కనపెట్టి నువ్వుచేస్తున్న పనేంవిటో చెప్పు?"

'నేనేం చేస్తున్నానయ్యా?' నేనేతప్పు చేయలేదన్న సంజాయిషీ ధ్వనించిందా మాటలో.

"ఒక దినం పనికొచ్చినట్లే ఉంటావు. రావు. ఇంకొక దినం మధ్యాహ్నందాకా పనిచేస్తావ్. ఆ తర్వాత ఎలా మాయమైపోతావో పోతావ్. దీంతో ఎంత పనిచేటో నేనెంత ఇబ్బంది పడుతున్నానో తెల్సా నీకు?"

"నిజఁవే! వచ్చేస్తా ఉండా! నేనేఁవన్నా కూలిదుడ్లియ్యండయ్యా? అనేమన్నా అడగతా ఉండానా?"

"లేదనుకో...అయినా ఇదేం పని?"

"ఏ పని?"

"ఒళ్ళొంచి కష్టపడేదానివి... ఒళ్ళమ్ముకోవడం?"

"ఒళ్ళమ్ముకుంటా ఉండానా? ఏ యదవో అటుమంటి కూత కూసింది నా ఎదటికి రమ్మనండి. వాడినాలిక అంటబెట్టి కోస్తానో లేదో?...హుఁ! ఇస్తానన్నా సెయ్యిజాపే బతుగ్గాదు".

ఆ అమ్మాయి కండ్లల్లో నిప్పులు రాలుతున్నాయి. చంద్రయ్య కాస్త మెత్తపడ్డాడు.

"అయితే నువ్వు చేస్తున్నపని ఎంతతప్పో నీకుతెల్సా?"

"తప్పో అది వొప్పో నాకు తెల్దు. మట్టిలోమట్టి అయ్‌పొయ్యే జల్మ. మణుసులు తినేసి పోతే పోనీలే!"

చంద్రయ్య చెంప మీద ఛెళ్ళున దెబ్బ పడినట్లయింది. ఇద్దరి గుండెల్లో నిశ్శబ్ద తరంగాల నిట్టూర్పులు పందిరికింద నిశ్శబ్దాన్ని చీలుస్తున్నాయి. కొన్ని క్షణాలు గడిచాయి. చంద్రయ్య ప్రయత్నపూర్వకంగా తలపైకెత్తాడు.

మంచుకడిగిన మల్లెలా స్వచ్ఛంగా ఉందామె ముఖం!

ఆ ముంఖంలోకి సూటిగా చూడలేక గిరక్కున వెనక్కు తిరిగాడు. వచ్చిన దారి వెంబడి అడుగుమీద అడుగ్గా నడుస్తున్నాడు. ఆలోచనలు మాత్రం దుందుడుకు పడ్తున్నాయి.

'ఆహా! ఎంత మాటనిందా అమ్మాయి? చదువూ సంధ్య లేదు. సంస్కారం లేదు. అయినా అనిన మాట? బదులు చెప్పలేక నోరు మూతపడింది. ఈ కర్మభూమిలో ఒక సాదా సీదా మనిషి ఈ మాట అనిగలిగిందంటే కారణం? 'పరోపకారార్థం ఇదం శరీరమ్' అన్న సూక్తిని నరనరాల్లోకి ఎక్కించారు మహానుభావులు! నిజంగా వాళ్ళను మెచ్చుకోవాలి. అయినా ఈ కర్మభూమిలో మనుషులు తెలివి మీరిపోతున్నారు".

అని ఆలోచిస్తూ నడుస్తూ ఉంటే-

చంద్రయ్య ఆలోచనలు తనకు తెలియకనే ఆ అమ్మాయి మీద నుండి చెట్టు మీదికి మళ్ళాయి. అయితే ఆ అమ్మాయికి చెట్టుకు ఏమి సంబంధం? అదే చంద్రయ్యకు అర్థంకాలేదు. ఆలోచన పరిపరివిధాల సాగినా చెట్టుకు ఆ అమ్మాయికి ముడి పెట్టాలని ఎంత ప్రయత్నించినా కుదరలేదు. అలా సతమత మవుతూనే చంద్రయ్య ఇల్లు చేరాడు.

చంద్రయ్య ఫారెస్ట్ డిపార్ట్‌మెంటులో రేంజి ఆఫీసర్!

అతనికి భార్య ఉంది. కొడుకులు ఉన్నారు. కూతుళ్ళు ఉన్నారు. కొడుకుల్లో ఒకరికి, కూతుళ్ళల్లో ఇద్దరికి పెండ్లి అయింది. వాళ్ళకు పిల్లలున్నారు. సాధారణంగా ఇంట్లో అడుగుపెట్టే చంద్రయ్య బాహ్య ప్రపంచాన్నే మరిచిపోతాడు. అతనికి ఆ ఇల్లే ఒక ప్రపంచమై పోతుంది. ఆ ప్రపంచంలో చంద్రయ్య పెద్దవాళ్ళకు పెద్దవాడు. పిల్లల్లో పిల్లవాడు. అటువంటి మనిషి ఆ రోజు పరాధీనతకు అధీనుడయ్యాడు. అయిష్టంగానే అంత ఎంగిలిపడ్డాడు. మిద్దెమీద ఆరుబయట మంచం వాల్చుకొని మేనువాల్చాడు.

వేసవికాలంలో ఒక రాత్రి. ఆకాశం కడిగితోసినట్లుంది. చుక్కలు మినుక్కు మినుక్కు మంటున్నాయి. వలయాకారంగా వంగిననింగి ఊరికి ఉత్తరాన కొండల్ని తనలో ఇముడ్చుకొని పుడమితల్లిని ముద్దులాడుతున్నట్లుంది. దాదాపు జామురాత్రి కావస్తూ ఉంది. మెల్లమెల్లగా వీస్తున్న పిల్లగాలులు ఆహ్లాదకరంగా ఉన్నాయి. అయినా చంద్రయ్యకు కంటిమీద రెప్ప పడలేదు.

ఆ అమ్మాయి ఎంత లేసుగా అనింది! ఏమనింది? "మట్టిలో మట్టి అయ్‌పొయ్యే జల్మ. మణుసులు తినేసిపోతే పోనీలే!" అని.

ఆ మాట చంద్రయ్య చెవుల్లో గింగిర్లు తిరుగుతూనే ఉంది.

ఆ మాటలో అరంభమైన ఆలోచనలు ఎక్కడ ఆగాయి? చెట్టు దగ్గర ఆగాయి. చెట్టుకు, ఆ అమ్మాయికి ఏం సంబంధం? ఏమీలేదు. అయినా ఆలోచన సాగిసాగి చెట్టు దగ్గరే ఆగుతుంది. అయితే చెట్టుకు, ఆ అమ్మాయికి ఏదో సంబంధం ఉండాలి. చంద్రయ్య ఇప్పుడు అదే ఆలోచిస్తున్నాడు.

స్త్రీ మానవ సృష్టికోసరం. చెట్టు సృష్టిలో కాలుష్యనివారణకోసరం. సృష్టికి కారకురాలైన స్త్రీ ఏంచేస్తూ ఉంది? వేదాంత భ్రమలో పడింది. మట్టిలో కలిసిపోయే జన్మను మనుషులు తింటే- అప్పటికి తానేదో ఒరగబెట్టేస్తున్న భ్రమలోపడి కాలుష్యవ్యాప్తికి తనకు తెలియకనే కారకురాలవుతూ ఉంది. అంతేకదా? క్షణిక సుఖంతో ఎంతోమందికి శాశ్వత సుఖ రోగాలు! అంటే- ఆ అమ్మాయి కూడా సమాజంలో కాలుష్యవ్యాప్తికి తన వంతు పాత్ర నిర్వహిస్తూ ఉంది. అయితే పాపం! ఆ అమ్మాయికి ఈ సంగతి తెలియదు. తన శరీరం సుఖం పేరుతో ఇతరులకు ఉపయోగపడుతున్నదన్న భ్రమలో ఉంది. పోనీ ఆ అమ్మాయికి తెలియకుండా అలాంటి భావనలో ఉందనుకుంటే తెలిసినవాళ్ళు మాత్రం ఏం తక్కువ తిన్నారని?

"ఈ రోజుల్లో న్యాయాన్యాయాలు నిర్ణయించేది నువ్వూ నేను కాదోయ్. కాల పరిస్థితి. ఏటి నీటి వాటంగా సాగిపోతున్న ప్రస్తుత పరిస్థితికి ఎదురీదాలనుకోవడం వెర్రితనం". అంటూ హితబోధచేసి చెట్లు నాటే కార్యక్రమాన్ని కాగితాలకే పరిమితం చేయమన్న డి.ఎఫ్.ఓ. మాటలకు లోబడి ఉంటే తానూకూడా కాలుష్యవ్యాప్తికి కారకుడైనట్లేకదా?

కాదని ఎదురుతిరిగి బస్సెక్కితే ఏమయింది?

పక్కన కూర్చున్న వ్యక్తి. అటు యిటు చూశాడు. ముందుకు వంగి తుపుక్కున ఉమ్మాడు. వేషం చూస్తే అంతోయింతో చదువుకొన్నవాడిలాగే ఉన్నాడు. ఏమీ ఎరగనట్లు మూతి తుడుచుకొంటున్నాడు.

"ఏంవండీ ఇది బస్సు!" అంటే–

"కాదని ఎవరన్నారు?"

"తెలిసి మీరు చేసిన పని?"

"నీ మీద పడిందా? లేదుగదా? మరి నీకెందుకు?"

మనస్సు చివుక్కుమనింది.

ఆస్ట్రేలియాలో ఎవరో ఒక వ్యక్తి. బాట మీద నడుస్తున్నాడట. నడుస్తూ నడుస్తూ నడుస్తున్న బాటమీదనే ఉమ్మాడట. పక్కన్నే నడుస్తున్న మరొక వ్యక్తి దీనిని గమనించాడు. అతన్నే అడిగి చేతి రుమాలు తీసుకొన్నాడు. ఆ రుమాలుతోనే ఆ ఉమ్మిని తీసి మళ్ళీ అతని చేతికే ఇచ్చి తనదారిన తానువెళ్ళాడట!

ఎప్పుడో చదివిన వార్త గుర్తుకొచ్చింది. వెంటనే ఇది భారతదేశమని కూడా గుర్తుకొచ్చింది. నోరే కాదు కండ్లు కూడా మూసుకొని కూర్చున్నాడు.

బస్సు కట్టమంచి దాటింది!

ముక్కుపుటాలను అదరగొట్టే కంపు. ఊపిరి బిగబట్టేవాళ్ళు కొందరు. ముక్కులు మూసుకునేవాళ్ళు కొందరు. ఊపిరాడక నోటితో గాలి పీల్చేవాళ్ళు కొందరు. చేతి రుమాళ్ళ విసనకర్రల్తో విసురుకొనేవాళ్ళు కొందరు!

తానూ కండ్లు తెరవక తప్పలేదు.

బాట పక్కనే చక్కెర ఫ్యాక్టరీ. ఆ ఫ్యాక్టరీ ఆవరణలో కుప్పలు కుప్పలుగా ముగ్గుతున్న మొలాసిస్. ఆ మొలాసిస్ నిరంతరంగా సరఫరా చేస్తున్న కంపు!

ఆ జిల్లా కేంద్రానికి ప్రతిరోజు వేలసంఖ్యలో కాకపోయినా వందల సంఖ్యలో ఎంతో మంది ఏవేవో పనులమీద వస్తున్నారు. పోతున్నారు. వస్తూ పోతూ ఈ కంపును భరిస్తున్నారే కానీ ప్రతిస్పందించడం లేదు. విచిత్రం ఏమిటంటే మనిషి నాగరీకుడయ్యేకొద్దీ స్వార్థపరుడై పోతున్నాడు. తనస్వార్థం తనదిగా సమాజబాధ్యతల నుండి వేరుపడి పోతున్నాడు. తత్కారణంగా సమస్యా పరిష్కారాలకు సామూహిక ప్రయత్నాలు కొనసాగడంలేదు. అథవా సాగించాలని ఎవడైనా ప్రయత్నిస్తే వాడొక పనికిరానివాడుగా ముద్రవేస్తున్నారు. లేకుంటే చక్కెర ఫ్యాక్టరీలో ఈ కంపు వ్యవహారం ఇలా కొనసాగుతుందా?

'శబ్దకాలుష్యానికి నావంతుపని మిగిలిపోయిందే?' అన్నట్లుగా ఆ డొక్కుబస్సు గీపెట్టే సరికి చంద్రయ్య ఆలోచనలు తెగిపోయాయి. చెవులు రెండూ మూసుకొని తల పక్కకు తిప్పాడు. ఎదురుగా వారుణీవాహిని!

అందమైన భవంతికి అంతకంటే అందమైన పేరు. అక్కడ జరుగుతున్న పని? సారాయిని సీసాలకు నింపడం.

ఆధునికుడైన మనిషి తెలివిగా తనఅవసరాలను తీర్చుకోవడానికి సాధించుకొన్న ప్రగతి వాతావరణాన్ని కలుషితం చేస్తూఉంటే ఆదాయం పేరిట ప్రభుత్వం అవలంబిస్తున్న పద్ధతి మనిషి ఆరోగ్యాన్ని కలుషితం చేస్తున్నది.

బుర్ర వేడెక్కింది. చాలదన్నట్లుగా ఒకకుక్క చావుఅరుపు అరిచింది.

"ఉన్నట్టుండి అడ్డంగా దూరింది. బ్రేక్ కొడ్తే మాత్రం ఏఁవవుతుంది? ఇదే అవుతుంది. అంతమాత్రానికే ఎందుకు లేని పోని శ్రమ? అయినా దిక్కుమాలిన కుక్కలు. పనీపాటా ఉండి ఏడిస్తేగదా? మా దుంప తెంచడానికిట్లా దాపురిస్తాయి. హ్హహ్హహ్హ! ఎన్ని కుక్కలో ఎన్ని కప్పలో!" అంటూ డ్రైవర్ నవ్వుకొంటున్నాడు.

ముందు చక్రం ఒకటి. వెనుక చక్రాలు రెండు. మొత్తం మూడు చక్రాలు తొక్కడంతో కుక్క నజ్జునజ్జుగా తారు రోడ్డుకు అతుక్కుపోయింది. నల్లని తారురోడ్డు మీద ఎర్రని రక్తం మడుగుకట్టి ఎర్రని ఎండలో మిలమిలా మెరుస్తూ ఉంది.

"తీరిపోతే తప్పించేదానికెవుడి తరం?"

"కుక్క చావంటే ఇదేనేమో?"

"సమయాసందర్భాల్లో మనిషి ఊరటచెందడానికి మందులా పనిచేస్తుంది–ఈ వేదాంత ధోరణి!" ఒక చిరునవ్వు చంద్రయ్య పెదాల్ని తడిమి వదిలింది.

ఆ దృశ్యాన్ని చూస్తుంటే తన మనసు మూగపోయింది. అయితే అదే చక్రాలు తారు రోడ్డు మీద నెరిపిన కంకుల్ని తొక్కుకుంటూ పోయినప్పుడు మాత్రం కడుపులో దేవినట్లయింది.

ఒకప్పుడు రైతులు తమ పొలాల్లోనే కళ్ళాలు తయారుచేసుకొనేవాళ్ళు. చిక్కని పేడ నీళ్ళతో అలికితే సిమెంటుతో గచ్చేసినట్లుండేవి ఆ కళ్ళాలు. వలయాకారంగా చూడ ముచ్చటగా ఉండే ఆ కళ్ళాల్లో పండించిన ధాన్యపు కంకుల్ని పలచగా నెరిపి ఎద్దుల్ని బంతి కట్టి తొక్కించేవాళ్ళు. అటువంటిది ఇప్పుడు తారురోడ్లు కళ్ళాలయ్యాయి. ఒక్క కుక్క నెత్తురే కాదు_రోడ్డుమీద పేడ, పెంటల్ని తొక్కిన చక్రాలు నూర్చిన ధాన్యం! ఆ ధాన్యం మనకు ఆహారం.

కోపం వచ్చింది. అయినా తాను ఏంచేశాడు? అయ్యో! ఈ వాతావరణ కాలుష్యంలో ఈ భూగోళం ఏమయిపోతుందో? అన్నబాధ మోసుకొని బస్సు దిగాడు. దిగిన మరుక్షణమే లౌకిక లంపటాల చీకిపొదలో చిగులుకొన్నాడు.

వీళ్ళందరూ ఏఁచేస్తున్నారు? వాతావరణ కాలుష్యానికి శక్తివంచనలేని కృషిచేస్తున్నారు. ఆ అమ్మాయి కూడా తన వంతు కృషిచేస్తున్నది. అయితే తేడా ఎక్కడుందంటే?– వీళ్ళందరు తెలిసి చేస్తున్నారు. అమాయకురాలు తెలియకుండా చేస్తూ ఉంది. హూఁ! మట్టిలో మట్టి

అయిపొయ్యే జన్మట. మట్టితినే వానపాము కాలుష్య నివారణకు తనవంతు కృషిచేస్తూ ఉంది. మట్టిపాలైన ఈ శరీరాల్ని కంపుగొట్టి పోకుండా పురుగులు మట్టిపాలు చేస్తున్నాయి. సృష్టిలో క్రిమికీటకాదులే కాలుష్య నివారణకు కృషి చేస్తుంటే మనిషి ఏం చేస్తున్నాడు? ఇదంతా ఆ అమ్మాయికి తెలుసా? తెలియదు. తెలియచెప్తే?

అప్పటికి చంద్రయ్య మనస్సు తేలిక పడింది.

చుక్క నడిమిట్టకొచ్చింది.

అతని కంటిమీద రెప్పపడింది !

* * * *

చంద్రయ్య ఎదురుచూస్తూ ఉన్నాడు. ఒక్క దినం జరిగింది. రెండు దినాలు జరిగాయి. వారం దినాలు జరిగాయి!

ఆ అమ్మాయి పనికిరావడం లేదు.

ఇలా జరుగుతుందని చంద్రయ్య ఊహించలేదు.

మంచికిపోతే చెడు ఎదురవుతుందని ఎలా ఊహిస్తాడు?

'ఈపూట వస్తుంది. రేపు వస్తుంది' అని ఎదురుచూస్తూనే ఉన్నాడు. ఎదురు చూస్తూ ఉండగానే వారం రోజులు గడిచిపోయాయి.

'ఆ అమ్మాయి ఎందుకు రావడంలేదు?' అని అడగలేదు. అడగకుండా ఉండలేదు. అడిగి ఆ అమ్మాయి బతుకులో రాళ్ళేశానా? అని బాధపడ్డాడు.

'అడగరాని మాటేఁవీ అడగలేదే? పోనీ! చెప్పరాని మాటమీ చెప్పలేదే?' అని తన్ను తాను సమర్థించుకొన్నా మనసు సమాధానపడడం లేదు.

మొత్తానికి ఆ అమ్మాయిని గురించి ఆలోచించకూడదనుకుంటూనే ఆలోచిస్తున్నాడు. ఇలాంటి ఆలోచనలతోనే చంద్రయ్యకు మరో అయిదారు రోజులు తెల్లారాయి.

ఆ రోజు కూడా తెల్లారింది!

అయితే ఆ రోజు తెల్లారడంలో ఒక ప్రత్యేకత! తన ఇంటిముందు ఒక అద్భుతం!

ఆశీస్సులు అందుకొని ఆ అమ్మాయి భర్తతో కలిసి వెళ్ళిపోయినా ఇంకా తన ఎదుట నిలబడి ఉన్నట్లే ఒక చిత్రమైన అనుభూతిలో చంద్రయ్య.

ఆ అమ్మాయి ఏమనింది?

"మట్టిలో మట్టి అయ్‌పొయ్యేజల్మ. మణుసులు తినేసిపోతే పోనీలే?" అని.

ఆమాట తనకు ఊహించని చెంపదెబ్బ. నిర్విణ్ణుడయ్యాడు ఒక్క క్షణం. వెంటనే సమాధానం చెప్పలేక మనసు మూగపోయింది. అయితే ఆ తర్వాత తీవ్రంగా ఆలోచించింది. ఆలోచించి ఏమని చెప్పింది?

"అమ్మాయ్. నువ్వేదో పెద్ద త్యాగం చేస్తున్నట్లు పొంగిపోతున్నావు. అయితే నువ్విచ్చే క్షణిక సుఖం ఎన్ని సుఖరోగాలకు దారితీస్తుందో? కాలక్రమంలో అది ఎయిడ్స్‌గా మారి జీవితాల్నే

నాశనం చేస్తూ ఉందో నువ్వు గ్రహించలేదు. ఎయిడ్స్ అంటే - అది తిరుగులేని ఒక భయంకర రోగం. జాగ్రత్త!" అంటూ హెచ్చరించాడు.

మంచి గొడ్డుకు ఒక దెబ్బ. మంచి మనిషికి ఒక మాట!

ఆ మాటతో ఆ అమ్మాయి మనసు మార్చుకొనింది. తనకు నచ్చిన తాను మెచ్చిన వ్యక్తిని తన జీవితంలోకి ఆహ్వానించింది.

ఎంత గొప్ప అవగాహన?

ఈ అవగాహన పిడివాదంతో పిడికిలి బిగించిన డి.ఎఫ్.ఓ దొరగారికి లేదే? బస్సులో ఉమ్మేసిన వ్యక్తికి లేదే? చక్కెరఫ్యాక్టరీలో యాజమాన్యానికి లేదే? వాహినీవారుణి పేరుతో సారా వరదలు కట్టిస్తున్న ప్రభుత్వానికి లేదే? తారు రోడ్లను కళ్ళాలుగా మారుస్తున్న రైతులకు లేదే?

అంటే కాలుష్యం ఎక్కడుంది?

అది మనిషి మనసులోనే ఉంది. ఆ మనస్సులు మారాలి. ఆ మనస్సుల్లో పేరుకొన్న కాలుష్యాన్ని కడిగేయాలి. అప్పుడు కాలుష్యం అన్నమాట మట్టికొట్టుక పోతుంది!

చంద్రయ్యఊహలకు రెక్కలువస్తే తాను కాలుష్యరహితలోకానికి ప్రతినిధికావాలి అని ఆశించాడు. అయితే-

అది చంద్రయ్య అందమైన కల! ●

స్వాతి మాసపత్రిక
(1, జనవరి 1993)